క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: అంతర్జాతీయ యోగాదినోత్సవం, సింహాచలం గిరిప్రదక్షిణ దృష్ట్యా 11 కేవీ సింహపురికాలనీ, 11 కేవీ దారపాలెం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నేపథ్యంలో సింహపురి కాలనీ, సింహపురి లేఅవుట్, దారపాలెం తదితర ప్రాంతాల్లో ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

స్క్రాప్ దుకాణంలో మహిళ మృతి


సంఘటన జరిగిన ఇండస్ట్రీ ఎదుట గుమిగూడిన గ్రామస్తులు


జోగురత్నం(ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: స్క్రాప్ దుకాణంలో పని చేస్తూ మహిళ హఠాత్తుగా మరణించిన సంఘటన మిందిరోడ్డు రాంనగర్‌లోని ఏ-బ్లాక్ ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. ఘటనపై గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివీ.. మిందిలో చిన కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న దేవరపు జోగురత్నం (47) ఆరేళ్లుగా రాంనగర్‌లోని సుప్రీంఇండస్ట్రీస్ (ఐరన్, స్టీల్ స్క్రాప్, ప్లాస్టిక్ స్క్రాప్)లో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ వంటి పనులు చేస్తుంది. బుధవారం యథావిధిగా పనులు చేసుకుంటున్న ఆమె హఠాత్తుగా చనిపోయిందని తోటి కార్మికులు, యజమాని తెలిపారు. విషయం తెలుసుకున్న గాజువాక పోలీసులు ఇండస్ట్రీకి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతురాలికి నష్టపరిహారం ఇవ్వాలని ఆమె బంధువులు, గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. కొంత నష్టపరిహారం చెల్లించడానికి యజమాని ఎం.డి.షఫీ అంగీకరించారని గ్రామ నాయకులు తెలిపారు. మృతురాలికి భర్త దేవరపు జోగారావు, కుమార్తెలు డి.కుమారి (32), డి.సాయి జ్యోతి (20) ఉన్నారు.

ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్(ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో పది రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థుల వయసు 21 ఏళ్ల నుండి 55 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఉచిత వసతి ఉంటుందని, స్టేషనరీ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే వారికి ఆ రంగంలో కనీసం ఏడాది అనుభవం ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9394885164 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కరెంట్ కోతలు ఆపండి


ఏఈకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: తరచూ కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపాలని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రాజును కలసి ఆ పార్టీ నాయకులు ఇల్లపు రాము, పి.వేణు, డి.దానప్పలు వినతిపత్రం సమర్పించారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలతో పాటు లోవోల్టేజీ సమస్య తలెత్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నాయకులు ఏఈ కి వివరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.గోవిందరాజులు,శంకర్రావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పెదగంట్యాడ: సీజీఆర్ఎఫ్, ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జోన్–2 డివిజన్ పరిధిలోని మల్కాపురం సబ్ డివిజన్, పెదగంట్యాడ కార్యాలయంలో ఈ నెల 13న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు బి.సులేఖా రాణి, ఆర్థిక సభ్యులు సుబ్బారావు, స్వతంత్ర సభ్యులు మురళీకృష్ణ హాజరు కానున్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ఈ వేదికలో విన్నవించి పరిష్కారం పొందాలని సీజీఆర్ఎఫ్ కార్యదర్శి కోరారు.

2 కిలోమీటర్లు.. 12 మలుపులు

ప్రమాదకరమైన మలుపు.. కాస్త ఆగి, నెమ్మదిగా వెళ్లండి.. అనే బోర్డును చూస్తే చాలు.. ఎంత వేగంగా వెళ్లేవారైనా కాస్త నెమ్మదిస్తారు. పరవాడ మండలంలోని వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రోడ్డును చూసేవారెవరికైనా.. ఇన్ని ప్రమాదకర మలుపులున్నా.. ఎక్కడా ఒక్క హెచ్చరిక బోర్డు కూడా లేదేంటన్న సందేహం రాకమానదు. రెండు కిలోమీటర్ల పొడవైన రోడ్డులో ఏకంగా 12 మలుపులున్నా.. అధికారులకు ప్రయాణికుల భద్రత ఏమాత్రం పట్టట్లేదు. దీంతో తరచూ ప్రమాదాలకు గురై, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రోడ్డులో భయంభయం

ఇరుకైన మలుపులు, ఇరువైపులా పెరిగిన తుప్పలతో తిప్పలు



పండగ వేళల్లో మరిన్ని ఇబ్బందులు

తీరంలో జరిగే మాఘపౌర్ణమి, మహాశివరాత్రి ఉత్సవాలకు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఈ మలుపుల వద్ద పల్టీలు కొడుతూ గాయాలపాలవుతున్నారు. రహదారి మలుపులు వద్ద వీధి దీపాలు లేకపోవడం మరిన్ని ప్రమాదాలకు కారణమవుతోంది. అతి ప్రమాదకరమైన రోడ్డు మలుపుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి ప్రమాదకర మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు, వీధి దీపాలను ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


రహదారిలో వెంకటపతిపాలెం వద్ద ప్రమాదకరమైన మలుపు

భయం భయంగా రాకపోకలు

ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల రాకపోకలకు ఇదే ప్రధాన రహదారి. చీకటి పడితే మలుపుల వద్ద దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోతున్నారు. వీటికి తోడు యువత వాహనాలను అతి వేగంగా నడపుతూ మలుపుల వద్ద వేగాన్ని నియంత్రించలేక పల్టీలు కొడుతున్న సంఘటనలు సర్వసాధారణంగా మారాయి. రోడ్డు మలుపుల్లో ఇసుక పేరుకుపోతుండడం వల్ల వాహనాలు స్కిడ్ అయి, ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడి బీచ్‌లకు కొత్తగా వచ్చే కొత్త ప్రయాణికులు రోడ్డు మలుపుల్ని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.

పరవాడ: వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. రెండు కిలోమీటర్ల నిడివి కలిగి 12 ప్రమాదకరమైన మలుపులతో కూడిన ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటే గుండె చిక్కబెట్టుకోవాల్సిందే. ముత్యాలమ్మపాలెం బీచ్ అందాలను ఆస్వాదించడానికి వచ్చే పర్యాటకులతో పాటు గ్రామ ప్రజలు ప్రమాదకరమైన మలుపులు దాటుకుని రాకపోకలు సాగిస్తున్నారు. రహదారిలో అతి ఇరుకైన మలుపులతో పాటు మలుపులు వద్ద ఇరువైపులా తుప్పలు, వ్యవసాయ పంటలు, చెట్లు, రోడ్డును ఆనుకుని నిర్మించిన ఇళ్ల ప్రహరీలు కారణంగా ఎదురెదురు వాహనాలను దగ్గరికి వచ్చేంత వరకు గుర్తించలేని పరిస్థితి. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారుతోంది.


రాముడుగారి చెరువు వద్ద ప్రమాదకరమైన మలుపు

హెచ్చరిక బోర్డులు పెట్టాలి



వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో మలుపులు ఎక్కువగా ఉండటం వల్ల ప్రయాణం చాలా కష్టంగా ఉంది. మలుపుల వద్ద తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడం సాధ్యం కావట్లేదు. మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రమాదకర మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

– అప్పలనాయుడు, ఆటోడ్రైవర్, నాయుడుపాలెం

తుప్పల్ని తొలగించాలి



రహదారిలో మలుపుల వద్ద దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. దీంతోపాటు రోడ్డులోగానీ, మలుపుల వద్దగానీ విద్యుత్ దీపాలు లేవు. రాత్రివేళ రాకపోకలు సాగించే సమయంలో చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదు. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పల్ని తొలగించి, మలుపుల వద్ద వీధి దీపాలను ఏర్పాటు చేయాలి.

– పైడంనాయుడు, వాహనచోదకుడు, రాముడుగారి గ్రామం

మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు


ఎన్‌సీసీ క్యాంప్ పర్యవేక్షకులతో కలిసి పరిశీలిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ఉపకులపతి ఆచార్య డాక్టర్ డి.సూర్యప్రకాశరావు సూచించారు. వర్సిటీలో 13వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ యువశక్తి వార్షిక శిక్షణ శిబిరానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్యాడెట్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి క్యాడెట్ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ మాట్లాడుతూ వర్సిటీలో పచ్చదనాన్ని బాగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు, పలు కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం


పల్లకీ ఉత్సవంలో శ్రీదేవి భూదేవి సహిత వెంకన్న

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కొలువైన వేంకటేశ్వరునికి బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమాఢ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసుడిని ఊరేగించారు. ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం భవనానికి శంకుస్థాపన

కాలనీ అసోసియేషన్, క్రీడాకారుల అభ్యంతరం


క్రీడాప్రాంగణంలో ఫైర్ సిబ్బంది తొలగించిన పోల్స్


ఫైర్ స్టేషన్ శంకుస్థాపనలో ప్రాంతీయ అగ్నిమాపక అధికారి నిరంజన్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహపురికాలనీలో రూ.2.25 కోట్లతో నిర్మించనున్న అగ్నిమాపక కేంద్రానికి బుధవారం ప్రాంతీయ అగ్నిమాపక అధికారి(జోన్–1) డి.నిరంజన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత భూమిపూజ జరిపి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అగ్నిమాపక అధికారి ఎస్.రేణుకయ్య, మర్రిపాలెం అసిస్టెంట్ అగ్నిమాపక అధికారి కె.వి.టి.ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యతిరేకించిన కాలనీ అసోసియేషన్, యువత

ఈ ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలం విషయంలో ఆది నుంచీ సింహపురికాలనీ హౌసింగ్ సొసైటీ అసోసియేషన్, కాలనీ యూత్, క్రీడాకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత స్థలాన్ని 30 ఏళ్ల నుంచి క్రీడా ప్రాంగణంగా వినియోగిస్తున్నారు. అలాంటి స్థలాన్ని ఫైర్ స్టేషన్‌కు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే హైకోర్టుని ఆశ్రయించారు. దాంతో ఉడా అధికారులు, కాలనీ అసోసియేషన్ నాయకులు ఈ విషయంపై చర్చించుకుని ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇంతలోనే హడావుడిగా ఫైర్ అధికారులు శంకుస్థాపన చేశారు. ఉదయం 9 గంటల్లోపు హోంమంత్రి వంగలపూడి అనిత చేతుల మీదుగా శంకుస్థాపన ఉంటుందని ప్రకటించారు. కానీ ఉదయం 6 గంటలకు హోంమంత్రి లేకుండానే శంకుస్థాపన కార్యక్రమాన్ని ముగించారు. హోంమంత్రి వస్తే తమ గోడు వినిపిద్దామనుకున్న కాలనీవాసులు వెనుదిరిగారు. స్థలంలో వాలీబాల్, షటిల్ తదితర క్రీడలకు సంబంధించిన పోల్స్, ఇతర సామగ్రిని ఫైర్ అధికారులు తొలగించడాన్ని కాలనీ యూత్ తప్పుబట్టింది. ప్రత్యామ్నాయం చూపకుండా స్థలాన్ని అప్పగించిన వుడా అధికారుల తీరుపై మండిపడ్డారు. న్యాయపరంగానే సమస్యపై పోరాడతామని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- పైడితల్లి అమ్మవారి పండగలో వైఎస్సార్‌సీపీ సహకారంతో ఏర్పాటు
- క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం


క్రికెట్ విజేత అప్పన్నపాలెం టీమ్‌కు నగదు, ట్రోఫీ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కాంతారా డ్యాన్స్ కమ్ స్కిట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ పురస్కరించుకుని మంగళవారం రాత్రి 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకుడు లంక సత్తిబాబు ఆర్థిక సాయంతో సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఏర్పాటుచేసిన కళావేదికపై పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జబర్దస్త్ ఫేమ్ మురళి, బషీర్, హరితేజ హాస్యంతో కడుపుబ్బా నవ్వించారు. ఈటీవీ ఢీ ఫేమ్ అక్షయ్, తరుణ్, సంతోష్‌లతో విశాఖకు చెందిన కరుణ ఈవెంట్స్ నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రోబో డ్యాన్స్, ఢిల్లీ బ్రదర్స్ ప్రత్యేక షో తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాదాపు అరగంటపాటు చేసిన కాంతారా డైలాగ్స్ కమ్ నృత్యప్రదర్శన ప్రోగ్రామ్‌కే హైలెట్‌గా నిలిచింది. మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్‌టోర్నీలో ప్రథమ స్థానంలో నిలిచిన అప్పన్నపాలెం టీమ్‌కు రూ.15 వేలు నగదు, షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన సింహాచలంలోని అంబేడ్కర్ కాలనీ జట్టుకు రూ.10 వేల నగదు, షీల్డ్ అందించారు. 98వ వార్డు పార్టీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, నాయకులు బోర కృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, దిలీప్‌రెడ్డి, బొట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న గోశాలలో ఏరువాక పున్నమి


శ్రీకృష్ణాపురంలోని గోశాలలో దుక్కి దున్నుతున్న సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు

సింహాచలం: ఏరువాక పున్నమి(జ్యేష్ఠ పౌర్ణమి)ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం భూమి పూజ నిర్వహించారు. నాగలికి, ఎద్దులకు పసుపు కుంకుమలు సమర్పించి, అనంతరం వాటి సాయంతో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు నేలను దున్నారు. గోశాలలో పలు పంటలు పండించేందుకు, పూల మొక్కలు పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతి రైతుకు ఏరువాక పున్నమి ఎంతో విశేషమైన రోజుగా భావిస్తారన్నారు. వ్యవసాయ పనులు ఏరువాక పున్నమి రోజునే ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ప్రాచీన వేదకాలం నుంచి జ్యేష్ఠ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా పిలవడం పరిపాటిగా మారిందన్నారు. గోశాల సీనియర్ అసిస్టెంట్ మూల వాసు పాల్గొన్నారు.

అంధకారంలో పెదగంట్యాడ

ప్రధాన మార్గాల్లో వెలగని వీధి లైట్లు


బాలచెరువు ప్రధాన రహదారిలో చిమ్మ చీకటి


సిద్ధేశ్వరం రోడ్డులో..

పెదగంట్యాడ: చీకటి పడితే ఆ మార్గాల్లో ప్రయాణం కష్టతరంగా మారుతోంది. సాయంత్రం అయితే వీధి వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి. బాలచెరువు, నడుపూరు ఎస్సీ కాలనీ, సిద్ధేశ్వరం, సీతానగరం, నమ్మిదొడ్డి, ఇస్లాంపేట, మదీనాబాగ్ తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి అయితే అంధకారం నెలకొంటుంది. రోడ్లు దాటే సమయంలో ఆయా ప్రదేశాల్లో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. స్పీడ్ బ్రేకర్లు కనిపించక పోవడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.సిద్ధేశ్వరం రోడ్డులో లైట్లు ఎప్పుడు వెలుగుతాయో.. ఎప్పుడు వెలగవో తెలియదు. గతంలో వీధి లైట్లు వెలగకపోతే పోల్ నెంబర్‌తో పాటు ఫిర్యాదు చేస్తే వెంటనే అధికారులు వచ్చి కొత్తవి అమర్చేవారు. ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పరిష్కరించేవారు. కానీ ఏడాది నుంచి వీధిలైట్ల నిర్వహణ అంతంతమాత్రంగానే ఉందని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని పెదగంట్యాడ వాసులు కోరుతున్నారు.

వెంకన్నకు అఖండ నారికేళ జలాభిషేకం


అభిషేకానికి తీసుకొచ్చిన కొబ్బరి బొండాలు


కొబ్బరి నీళ్లతో అభిషేకం చేస్తున్న అర్చకులు

పెందుర్తి: జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని వేంకటాద్రిపై కొలువుదీరిన వెంకన్నకు బుధవారం అఖండ నారికేళ జలాభిషేకం నిర్వహించారు. 27 నక్షత్రాలను 27 కలశాలలోకి ఆవాహనం చేసి, 1008 కొబ్బరి బొండాల నీటితో స్వామిని అభిషేకించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం వైభవంగా జరిగింది.

యోగాతో ఆరోగ్యం, ఉల్లాసం


యోగ సాధన చేస్తున్న అగనంపూడి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

అగనంపూడి: యోగా ప్రాధాన్యతను నలుదిశలా వ్యాపించేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్‌కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు బుధవారం ఉచిత యోగ శిక్షణ కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పుట్టిన యోగాకు ప్రపంచ దేశాల్లో ప్రాధాన్యం సంతరించుకొనేలా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ యోగ సాధన మంచి ఆరోగ్యానికి అవసరమన్నారు. విద్యార్థులు ప్రతీరోజూ యోగ సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిళ్లను అధిగమించి ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దివ్య, శ్రీదేవి, సూర్య ప్రదీప్ పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ నాగేంద్రకు అభినందనలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్‌స్టార్ పురస్కారం దక్కించుకున్న జె.హేమంత్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, తదితరులు అభినందించారు. హేమంత్ బాటలో వచ్చే ఏడాదిలో మరింత మంది విద్యార్థులు పురస్కారాలు దక్కించుకోవాలన్నారు.